## క్లుప్తంగా

### బిల్ కలెక్టర్లకు ఎల్ఆర్ఎస్ బాధ్యతలు

**ఖమ్మంమయూరిసెంటర్:** ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత్ర స్థాయి పరిశీలన బాధ్యతలను బిల్ కలెక్టర్లకు అప్పగించారు. ఈ మేరకు గురువారం బిల్ కలెక్టర్లు, వార్డ్ ఆఫీసర్లకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనపై అవగాహన కల్పించారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 25 వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడం, టౌన్‌ప్లానింగ్ విభాగంలో సిబ్బంది తక్కువగా ఉండడంతో దరఖాస్తుల పరిశీలనలో తీవ్ర జాప్యం జరుగుతుంది. దీంతో అధికారులు బిల్ కలెక్టర్లతో ఎల్1 స్టేజీలో దరఖాస్తుల పరిశీలన చేయించాలని నిర్ణయించారు. శుక్రవారం నుంచి మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తుల పరిశీలన చేయాలని అధికారులు బిల్ కలెక్టర్లను ఆదేశించారు. దీంతో నేటి నుంచి బిల్ కలెక్టర్లు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు క్షేత్రస్థాయికి వెళ్లనున్నారు.

### కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న నాయకులు

**రఘునాథపాలెం:** మండలంలోని కోయచలక గ్రామంలో కల్యాణలక్ష్మి పథకంలో మంజూరైన చెక్కులను గురువారం ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు తాతా రఘురాం, చెరుకూరి పూర్ణచంద్రరావు, రెంటాల ప్రసాద్, మేళ్లచెరువు రాంప్రసాద్, మాదంశెట్టి హనుమంతరావు, సీతారాములు, ముత్తయ్య, చెరుకూరి కృష్ణారావు, వెంకటేశ్వర్లు, బలుసుపాటి శేషయ్య నాగేశ్వరరావు, యేసు, రమేష్ , పెంటయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### క్షేత్ర స్థాయిలో ఉద్యమించాలి

**నేలకొండపల్లి:** పెట్టుబడిదారుల దోపిడీపై క్షేత్ర స్థాయిలో ఉద్యమించాలని ఇఫ్టూ పాలేరు ఏరియా కార్యదర్శి పగిడికత్తుల రామదాసు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఇఫ్టూ ఆధ్వర్యంలో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ నెల 20న హైద్రాబాద్‌లో ఇఫ్టూ విలీన సభను విజయవంతం చేయాలని కోరారు. ఇఫ్టూ అనేక సమస్యల పై పోరాటాలు నిర్వహించి విజయాలు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకట్, హిరాలాల్, ఆనంద్, సుజాత, వీరకుమారి, సైదా వాలీ, యశోద, కౌసల్య, అక్బర్, జానమ్మ, రఘు, విజయ, అమరావతి, లక్ష్మి, కరుణసింగ్ తదితరులు పాల్గొన్నారు.

### కమిషనర్‌ను కలిసిన అసిస్టెంట్ కమిషనర్

**ఖమ్మంమయూరిసెంటర్:** మధిర మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తూ కేఎంసీకి అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీపై వచ్చిన అహ్మద్ సఫీ ఉల్లాహ్ గురువారం కమిషనర్ అభిషేక్ అగస్త్యను మర్యాదపూర్వకంగా కలిశారు. మధిర నుండి రిలీవ్ అయి వచ్చిన ఆయన కేఎంసీలో అసిస్టెంట్ కమిషనర్ బాధ్యతలు తీసుకోనున్నారు. ఇక ప్రస్తుతం అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సంపత్‌కుమార్ ఇంకా రిలీవ్ కాలేదు.

### నగరంలో సినిమాలు

| | |
|---|---|
| తిరుమల | దేవర |
| వినోద | జనక అయితే గనక |
| సాయిరాం | విశ్వం, స్వాగ్ |
| ఆదిత్య | జోకర్, దక్షిణ, రాంనగర్ బన్ని |
| శ్రీనివాస | వెట్టియన్:ద హంటర్ |
| సినీ గెలాక్సీ | మా నాన్న సూపర్ హీరో |

- ఖమ్మం గాంధీచౌక్

### ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

| కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో) | | ఆకుకూరల కట్టలు (రూ.ల్లో) | |
|---|---|---|---|
| టమాట | 56 | బచ్చలికూర | 3 |
| వంకాయ | 44 | | 20 |
| బెండకాయ | 38 | పాలకూర | 3 |
| పచ్చిమిర్చి | 54 | | 20 |
| కాకర | 48 | చుక్కకూర | 3 |
| బోడ కాకర | 120 | | 20 |
| బీర | 54 | తోటకూర | 3 |
| దొండ | 26 | | 20 |
| పొట్లకాయ | 60 | గోంగూర | 5 |
| చిక్కుడు | 70 | | 20 |
| గోరుచిక్కుడు | 48 | మెంతికూర | 2 |
| క్యాబేజీ | 36 | | 20 |
| క్యాలీఫ్లవర్ | 35 | కొత్తిమీర | 1 |
| ఆలుగడ్డ | 40 | | 50 |
| చామగడ్డ | 44 | పుదీన | 1 |
| క్యారెట్ | 64 | | 25 |
| క్యాప్సికం | 88 | -ఖమ్మం వ్యవసాయం | |

# స్కానింగ్ ఆగిపాయే..

**పెద్దాస్పత్రిలో నిలిచిన సీటీ స్కాన్ సేవలు**

- కేబుళ్లలో లోపంతో స్కానింగ్ రూంకి విద్యుత్ సరఫరా బంద్
- మూడు రోజుల నుంచి అంధకారంలోనే..
- ఇబ్బందులు పడుతున్న రోగులు



చీకట్లో స్కానింగ్ గది



పరీక్షించేందుకు తవ్వి బయటకు తీసిన కేబుళ్లు

**ఖమ్మం వైద్యవిభాగం:** ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో సీటీ స్కానింగ్ సేవలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయంతో మూడు రోజులుగా సేవలు బంద్ అయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి స్కానింగ్ గదికి విద్యుత్ సరఫరా చేసే వైర్లు కేబుళ్లు తెగిపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగుల్లో స్కానింగ్ అవసరం ఉన్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడేళ్ల క్రితం స్కానింగ్ మిషన్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇక్కడ నిత్యం 25 నుండి 30 మంది రోగులకు స్కానింగ్ చేస్తుంటారు. అవసరాన్ని బట్టి రాత్రి షిఫ్టులో కూడా టెక్నీషియన్‌ను పిలిపించి స్కానింగ్ చేస్తుంటారు. అయితే విద్యుత్ సరఫరా నిలిచిపోవటంతో మూడు రోజులుగా స్కానింగ్ గది అంధకారంలో ఉండిపోయింది. అయితే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వైర్లు భూమిలో నుండి స్కానింగ్ గది వరకు వేశారు. ఆ ప్రాంతంలో తవ్వి కేబుళ్లను పరీక్షిస్తున్నారు. అయితే సమస్య ఎక్కడ ఉందో ఇంత వరకు కనుగొనలేదు.

**ఆర్థికంగా నష్టపోతున్న రోగులు..**

సీటీ స్కానింగ్ సేవలు అందుబాటులో లేకపోవటంతో ఆస్పత్రికి వచ్చే రోగులు నిరాశతో వెనుతిరిగిపోతున్నారు. మరికొందరు చేసేది లేక ప్రైవేటు డయాగ్నస్టిక్స్‌కు వెళ్లి ఆర్థికంగా నష్టపోతున్నారు. సాధారణంగా ఎక్కువ శాతం పెద్దాస్పత్రికి నిరుపేద రోగులే వస్తుంటారు. అసలే నిరుపేదలు స్కానింగ్ బయట తీయించుకోవటానికి స్థోమత లేని వారు రోగం నిర్ధారణ కాక ఉన్న అనారోగ్యం తీవ్రత మరింత పెరిగిపోతుందని వాపోతున్నారు. అంతేకాకుండా అత్యవసర రోగులు, యాక్సిడెంట్‌లో తీవ్ర గాయాలపాలైన వారికి స్కానింగ్ వెంటనే చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం సేవలు అందుబాటులో లేకపోవటంతో వారు మరింత ఇబ్బందిపడాల్సి వస్తోంది. వారిని హుటాహుటిన ప్రయివేటు ఆసుపత్రులకు తరలించాల్సి వస్తోంది. ఈ విషయంపై ఆర్ఎంఓ బి.రాంబాబును వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్ నుంచి స్కానింగ్ గదికి వెళ్లే కేబుళ్లు కట్ కావటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. భూమిలోపల ఉన్న కేబుళ్లు బయటకు తీసి పరీక్షిస్తున్నారన్నారు. ఒకటి, రెండు రోజుల్లో స్కానింగ్ గదికి విద్యుత్ సరఫరా పునరిద్ధరిస్తామన్నారు.

# గాడి తప్పుతున్న జవాన్లు..

- కమీషన్ల కోసం వివాదాలు
- కేఎంసీ వర్కర్లపై దురుసు ప్రవర్తన

**ఖమ్మంమయూరిసెంటర్:** ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న జవాన్లు శృతిమించి వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. జవాన్లు పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తూ, కార్మికుల హాజరు నమోదు చేసుకోవడం, వర్కర్లతో డివిజన్లలో పనులు చేయించాలి. వాటిని పక్కన పెట్టిన జవాన్లు విధులకు సక్రమంగా హాజరు కాకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొంత మంది జవాన్లు వర్కర్లకు వేతనాలు వచ్చిన సమయంలో కమీషన్లు తీసుకుని మరీ మద్యం పార్టీలు చేసుకోవడం వంటివి చేస్తున్నారని, డబ్బులు ఇవ్వని వారిపై దురుసుగా ప్రవర్తిస్తున్నారన్న ఫిర్యాదులు అధికారులకు అందుతున్నాయి. కొంత మంది జవాన్లకు స్థానిక కార్పొరేటర్ల మద్దతు ఉండడంతో వారు అధికారుల మాట కూడా వినే పరిస్థితి లేదని తెలుస్తుండగా.. మరి కొంత మంది జవాన్లు కార్పొరేటర్ల మాట వినడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

**చర్యలు శూన్యం..**

జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఏడాది రెండేళ్లకు ఒకసారి మార్చాల్సి ఉంది. అయితే కేఎంసీలో జవాన్లను డివిజన్లు మార్చకపోవడంతో ఏళ్ల తరబడి అనేక మంది ఒకే చోట విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో జవాన్లు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్న చందంగా మారింది. కొంత మంది జవాన్లు ఉదయం కార్మికుల నుంచి హాజరు తీసుకొని ఇళ్లకు వెళ్లిపోతున్నారని, తమ సొంత పనులు చక్కబెట్టుకుంటూ కార్పొరేషన్, డివిజన్ పనులను గాలికొదిలేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. జవాన్లపై గత కొన్ని నెలలుగా ఫిర్యాదులు వస్తున్నా.. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఫిర్యాదులు వచ్చిన సమయంలో జవాన్లను తూతూమంత్రంగా మందలించి వదిలేస్తున్నారన్న విమర్శలు అధికారులపై ఉన్నాయి. అధికారులు పట్టించుకోకపోవడం తోనే జవాన్ల ఆగడాలు పెరిగిపోయాయనే చర్చ కేఎంసీలో జరుగుతోంది.

**కార్మికుడిపై దాడి..**



అధికారులకు ఫిర్యాదు చేసేందుకు శ్రీను

41వ డివిజన్‌లో పనులు చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు వెంగలదాసు శ్రీను తనపై జవాన్ దురుసుగా మాట్లాడి, దాడికి పాల్పడ్డాడని తనకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం ఉదయం కేఎంసీ కార్యాలయంకు తోటి వర్కర్లతో కలిసి అధికారులను కలిసేందుకు వచ్చాడు. అధికారులు బిజీగా ఉండడంతో కార్మికుడు సాయంత్రం వరకు కార్యాలయంలోనే సంచరించాడు. ఇక శానిటరీ సూపర్‌వైజర్ దృష్టికి ఘటన విషయం తీసుకెళ్లడంతో ఆయన జవాన్‌ను మందలించినట్లు తెలిపారు. దసరా పండుగకు వసూలు చేసిన మాముళ్లు తనకు ఇవ్వలేదనే కారణంతో జవాన్ దాడి చేసినట్లు తోటి వర్కర్లు తెలిపారు. అయితే వర్కర్‌పై దాడి చేసిన సమయంలో జవాన్ మద్యం మత్తులో ఉన్నాడని వర్కర్లు పేర్కొన్నారు.

**జవాన్ల డివిజన్లు మార్పు..**

**ఖమ్మంమయూరిసెంటర్:** ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో పలువురి జవాన్ల డివిజన్లను మార్చుతూ అధికారులు నిర్ణయించారు. ఇటీవల కార్పొరేటర్ల నుండి జవాన్లను తమ డివిజన్ల నుంచి మార్చాలని వినతులు రావడంతో అధికారులు ఆరోపణలను ఎదుర్కొంటున్న పలువురిని ఆ డివిజన్ల నుండి వేరే డివిజన్లకు మార్చారు. వారి స్థానంలో ఇతర డివిజన్ల జవాన్లను నియమించారు. 1వ డివిజన్ జవాన్‌కు 60కు మార్చగా, 60వ జవాన్‌ను 1కి, 8వ జవాన్‌ను 13కు, 13వ జవాన్‌ను 8కు, 11వ జవాన్‌ను 32కు, 29వ జవాన్‌ను 21కు, 21వ జవాన్‌ను 44కు, 44వ జవాన్‌ను 36కు, 39వ జవాన్‌ను 42కు, 42వ జవాన్‌ను 39కు కేటాయించారు. ఇక 11వ డివిజన్‌లో కొత్త జవాన్‌ను నియమించారు. ఇదిలా ఉండగా వర్కర్‌పై చేయి చేసుకున్న 41వ డివిజన్ జవాన్‌ను విధులకు హాజరు కావద్దని ఉన్నతాధికారులు శానిటరీ సూపర్‌వైజర్‌కు ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.

## ఛత్రపతి శివాజీ జీవితం స్ఫూర్తిదాయకం

- విగ్రహాన్ని ఆవిష్కరించిన మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

**ఖమ్మంఅర్బన్:** ఛత్రపతి శివాజీ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. ఖమ్మం 7వ డివిజన్ ఖానాపురంలో ఛత్రపతి శివాజీ సంకల్ప యూత్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన విగ్రహాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. తొలుత ఈటెలకు ఎన్టీఆర్ సర్కిల్ వద్ద స్వాగతం పలికిన నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా ఖానాపురం వెళ్లగా, పాత ఖానాపురంలో కోలాటాలు, బతుకమ్మలతో మహిళలు స్వాగతించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ ప్రజాసంక్షేమం కోసం శివాజీ నిరంతరం తపించే వారని, ఆయన వీరత్వం, భయానికి తావులేని కార్యాచరణ ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. కాగా, కొంతకాలంగా హైదరాబాద్‌లో హిందువుల దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, నాయకులు డాక్టర్ శీలం పాపారావు, తాండ్ర వినోదరావు, సన్నె ఉదయ్‌ప్రతాప్, నంబూరి రామలింగేశ్వరరావు, అల్లిక అంజయ్య, శ్యాం, రవికుమార్, రుద్రప్రదీప్, కుమిలి శ్రీనివాసరావు, వెంకన్న, రామకోటేష్ తదితరులు పాల్గొన్నారు.

### నివాళి

**తిరుమలాయపాలెం:** మండలంలోని జల్లెపల్లి గ్రామానికి చెందిన సీపీఎం నాయకులు ఉన్నం రామయ్య మృతి చెందగా గురువారం మండలంలోని జల్లెపల్లి గ్రామంలో రామయ్య మృతదేహాన్ని పార్టీ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. పార్టీ మండల కార్యదర్శి శ్రీను, నాయకులు దాసరి మహేందర్, మట్టా సుధాకర్, దడిదల వెంకన్న, మద్దినేని వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, దర్గయ్య, రమేష్, శ్రీను, హనుమంతరావు ఉన్నారు.

### హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

**తిరుమలాయపాలెం:** ప్రజా సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలు నిర్వహిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని పిండిప్రోలులో పార్టీ మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27న పిండిప్రోలులో జరిగే మండల మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్, జిల్లా కమిటీ సభ్యులు బషీరుద్దీన్, మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, నాయకులు పద్మనాభుల సుధాకర్, అంగిరేకుల నరసయ్య, బింగి రమేష్, వెంకట్రావు, నాగేశ్వరరావు, కొలిచలం స్వామి, పుష్పవతి, సైదులు, కోట ఉపేందర్ రెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### 'ఆరు గ్యారంటీ'లను అమలు చేయండి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

**ఖమ్మంమయూరిసెంటర్:** కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరుగ్యారంటీలను తక్షణం అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి సమావేశం గురువారం జిల్లా అధ్యక్షుడు పగిడిపల్లి ఏసు అధ్యక్షతన స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత బస్సు ప్రయాణం మాత్రం పూర్తి స్థాయిలో అమలవుతుందని మిగిలిన వాటిపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. పేద మహిళా కూలీలకు ఏడాదికి రూ.19వేలు, పింఛన్లు పెంచి ఇస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు వాటిని అమలు చేయడం లేదన్నారు. ఈ సమావేశంలో నాయకులు పగిళ్ల వీరభద్రం, రామలక్ష్మి, పిల్లల రాంబాబు, భూక్యా సేనియా పాల్గొన్నారు.

### ధర్నాకు తరలిన నాయకులు

**ఖమ్మంవ్యవసాయం:** విద్యుత్ ఆర్టిజన్ల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం వరంగల్ ఎన్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించగా ఈ ధర్నాకు నాయకులు వెళ్లారు. సంఘం రాష్ట్ర నాయకులు ఈశ్వరరావు, వజీర్, నాగరాజు, చంద్రారెడ్డి, ప్రసాద్, శ్రీనివాస్, బీవీఎస్ మూర్తి, అన్వర్, ఉపేందర్ ఉన్నారు.

### మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

**ఖమ్మం సహకారనగర్:** రీజినల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌కు తమ విద్యార్థులకు ఎంపికైనట్లు హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డిలు తెలిపారు. గురువారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ... గత నెల 8న ఖమ్మంలో నిర్వహించిన ప్రైమరీ రీజినల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షలో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారన్నారు. నవంబర్ 3న జరగనున్న రీజినల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షకు టి.శ్రీజిత్, రుష్యేంద్రమణి, కె.రుషిత్, సాయి అక్షిత్‌లు పాల్గొననున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ ఫౌండేషన్ ఇన్‌చార్జ్ ఉమా మహేశ్వరరావు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మసీదుల అభివృద్ధికి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న దృశ్యం

**ఖమ్మం మామిళ్లగూడెం:** ఇటీవల రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మంలోని 63 మసీదులకు అభివృద్ధికి మసీదుకు రూ. లక్ష చొప్పున ఆర్థికసాయం ప్రకటించిన క్రమంలో గైర్హాజరయిన మసీదుల బాధ్యులకు గురువారం ఖమ్మం ఉర్దూఘర్ షాదీఖానాలో చెక్కులు అందజేశారు. మరో 8 మసీదులకూ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఛోటేబాబా, షాదీఖానా డైరెక్టర్ సలీం చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హాఫీజ్ జవ్వాద్ అబ్దుల్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యసేవలే లక్ష్యం



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న సైదులు

**కామేపల్లి:** మారుమూల, అటవీ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే ప్రధాన లక్ష్యంగా వైద్యులు, సిబ్బంది సమష్టిగా పని చేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సైదులు అన్నారు. గురువారం మండలంలోని మద్దులపల్లి గుట్టపై ఊటవాగు ప్రాంతంలో నివాసముంటున్న గొత్తికోయలకు కామేపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యాన చిన్నారులు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లోని వలస ఆదివాసీలకు వైద్య సేవలు కల్పించడమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. గొత్తికోయలకు ఆరోగ్య పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అదే విధంగా ఐసీడీఎస్ ఆధ్వర్యాన బాలింతలు, గర్భిణులు, చిన్నారులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు గుడ్లు, బాలామృతం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి నెల్లూరి చందన, సీడీపీఓ దయామణి, సూపర్‌వైజర్లు కృష్ణకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మత్స్యకారుల అభివృద్ధికి 'చేప పిల్లలు'

**తిరుమలాయపాలెం:** మత్స్య కార్మికుల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం అందజేస్తున్న చేప పిల్లల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సిలార్ సాహెబ్ కోరారు. మండలంలోని ఆయా గ్రామాల పరిధిలోని మత్స్యకార్మిక సంఘాలకు ప్రభుత్వం ద్వారా మంజూరైన ఉచిత చేప పిల్లలను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఫీల్డ్ ఆఫీసర్ చాముండేశ్వరి, మత్సకార్మిక సంఘం నాయకులు ఓర వెంకటేశ్వర్లు, పులకాని వెంకటనర్సయ్య పాల్గొన్నారు.



చేప పిల్లలను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

### సదస్సును జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వేణు

**ఖమ్మం మామిళ్లగూడెం:** ఈనెల 21న ఖమ్మంలో జరిగే పీడీఎస్‌యూ అర్ధశతాబ్ద ఉత్సవంలో భాగంగా విద్యార్థి ప్రదర్శనతో పాటు, రిక్కాబజార్ హైస్కూల్‌లో పూర్వ ప్రస్తుత విద్యార్థి నాయకులతో జరిగే సదస్సును జయప్రదం చేయాలని సంఘం నాయకులు టి.వేణు కోరారు. గురువారం సీపీఐ ఎంఎల్, న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని ఓయూ లోని ఠాగుర్ ఆడిటోరియంలో ఈ నెల 24న జరిగే సభలను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు వెంకన్న, రమేష్, సుభాన్, మోహన్‌రావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు క్రాంతి, మస్తాన్, సాగర్‌రవి పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

**నేలకొండపల్లి:** పేద ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమించిన యోధుడు మాజీ ఎమ్మెల్యే కర్నాటి కృష్ణయ్య అని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని ఉమ్మడి ఖమ్మం తొలి మాజీ ఎమ్మెల్యే కర్నాటి కృష్ణయ్య వర్ధంతి సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మారకస్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కమ్యూనిస్టు పార్టీలో చేరినప్పటి నుంచి తుదిశ్వాస వరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై క్షేత్ర స్థాయిలో ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ నాయకులు హేమంతరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, మండల కార్యదర్శి కర్నాటి భానుప్రసాద్, కనకబండి సీతారాములు, మల్లెబోయిన ఉపేందర్, పల్లపాటి అశోక్, మహేష్, కాశిబోయిన అయోధ్య, పోలంపల్లి నారాయణ, మాధవరావు, వల్లాల కృష్ణ, మల్లయ్య, నారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

## అధ్వానంగా ప్రధాన రోడ్డు..

- పెద్ద గుంతలతో నానా అవస్థలు



రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

**రఘునాథపాలెం:** ఒక వైపు లింక్‌రోడ్లు,డొంక రోడ్లుకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించుతున్నప్పటికీ మండలంలోని రాములుతండాలో ప్రధాన రోడ్డు మాత్రం బాగుపడటం లేదు. తారు రోడ్డు పేరుకే తప్ప ఆరోడ్డును చూస్తే అడవి రోడ్డు కంటే దారుణంగా ఉంది. అసలే గ్రామంలో రోడ్డు ఇరుకుగా ఉందంటే దాంట్లోనే రోడ్డు మొత్తం మూలమలుపుల వద్ద గుంతలు పడి వాటిలో వాన నీరు నిలిచి బురద రోడ్డుపై వాహనాలు వచ్చినప్పుడల్లా చక్కర్లు కొడుతోంది. ఈ రోడ్డు పలు గ్రామాలకు లింక్‌రోడ్డుగా ఉండటంతో నిత్యం ఈ రోడ్డులో వాహనాలు ఎక్కువ సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. గ్రామంలోని విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే ఈ బురద గుంతలను అష్టకష్టాలతో దాటుకుంటూ పోవాల్సి వస్తుంది. బావోజితండా, తదితర గ్రామాలకు రాకపోకలు సాగించాల్సిందే. ఇటీవల ప్రభుత్వం డిజిటల్ కార్డుల కోసం ప్రయోగాత్మకంగా ఈ గ్రామంను ఎంపిక చేసి అధికారుల బృందం గ్రామంలో సందర్శించారు. కలెక్టర్, జిల్లా ప్రత్యేక అధికారి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ తదితరులు సందర్శించిన సమయంలో సైతం ఈరోడ్డు మురుగులోనే దర్శనమిచ్చింది. నేరుగా రోడ్డు పరిస్థితి చూసిన అధికారులు స్పందించి తమ రోడ్డును బాగు చేయాలని, గుంతల బుడుగు బాధలనుండి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.